క్లుప్తంగా

రేపటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

జియాగూడ: జియాగూడ మహంకాళి ఆలయంలో ఈనెల 22 నుంచి 29వ తేదీ వరకు వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గొడుగు ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు సోమవారం వార్షికోత్సవ వేడుకల ఉత్సవ బ్రోచర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 22వ తేదీన ఉగాది పండగను పురస్కరించుకుని మాతేశ్వరీకి పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, భక్తులకు దర్శన సౌభాగ్యం, సాయంత్రం 5 గంటలకు శోభకృత్ నామ సంవత్సర పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు. 23న గురువారం అమ్మవారి వార్షికోత్స వేడుకలను పురస్కరించుకుని అభిషేకం, అలంకరణ, యజ్ఞమహోత్సవం, అఖండ హారతి, ప్రసాద వితరణ ఉంటుందన్నారు. అలాగే 29వ తేదీ వరకు చైత్ర నవరాత్రి వేడుకలను కొనసాగుతాయని, ప్రతిరోజూ మాతేశ్వరీని ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఉంటుందన్నారు.

ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించాలి


నివాళులర్పిస్తున్న కొత్త కృష్ణవేణి తదితరులు

గన్‌ఫౌండ్రీ: చిన్ననాటి నుంచే పిల్లల్లో ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించాలని ప్రముఖ సామాజిక వేత్త కొత్త కృష్ణవేణి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సరసిజ థియేటర్ ఫర్ విమెన్ సంస్థ ఆధ్వర్యంలో అన్నమాచార్య వర్ధంతి సందర్భంగా అన్నమాచార్య సప్తగిరి సంకీర్తనలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హేమా ముక్తేశ్వర్‌రావు శిష్యబృందం ఆలపించిన సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అత్తలూరి విజయలక్ష్మి, పెండ్యాల లక్ష్మి పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌కు అన్ని వర్గాల మద్దతు'



మాట్లాడుతున్న ముత్యాల భాస్కర్

గోల్కొండ: బీఆర్‌ఎస్ పార్టీ ఉద్యమ పార్టీ అని కేసీఆర్ పక్కా సెక్యులర్ ముఖ్యమంత్రి అని సీనియర్ బీఆర్‌ఎస్ నాయకుడు కార్వాన్ కంటెస్టెండ్ కార్పొరేటర్ ముత్యాల భాస్కర్ అన్నారు. సోమవారం కార్వాన్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆశయాలకు బీఆర్‌ఎస్ పాలన అద్దంపడుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేడు దేశంలోని ఇతర రాష్ట్రాలకు కాపీ చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల మద్దతు బీఆర్‌ఎస్ పార్టీకి ఉందని ఆయన అన్నారు.

లోధ్ కులస్తుల అభ్యున్నతికి కృషి


నూతన అధ్యక్షుడు మహేష్‌సింగ్ మాతావాలేను సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: లోధ్ కులస్తుల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తానని లోధ్ క్షత్రియ సదర్ పంచాయత్ నూతన అధ్యక్షుడు న్యాయవాది మహేష్ సింగ్ మాతేవాలే పేర్కొన్నారు. లోధ్ క్షత్రియ సమాజ్ జరిగిన ఎన్నికల్లో నూతనంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహేష్ సింగ్ మాతేవాలే మాట్లాడుతూ.. ధూల్‌పేట్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉన్న లోధ్ కులస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. తనను గెలిపించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. లోధ్‌ల అభివృద్ధే తన ప్రథమ కర్తవ్యమని ఆయన అన్నారు. సంఘం ఆధ్వర్యంలో తరచూ సేవా కార్యక్రమాలు చేపడుతామని మహేష్‌సింగ్ మాతేవాలే వివరించారు.

బస్తీ దవాఖానాలకు రోగుల తాకిడి

గోల్కొండ: కార్వాన్, గోల్కొండ, కుమ్మరివాడిలలోని బస్తీ దవాఖానాలతో పాటు గోల్కొండ, అహ్మద్‌నగర్ డివిజన్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైతం రోగుల తాకిడి పెరిగింది. సీజనల్ వ్యాధులు ప్రబలడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తమకు సమీపంలోని బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వస్తున్నారు.

రంజాన్ మాసంలో అన్ని ఏర్పాట్లు చేయాలి

ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అహ్మద్ పాషా ఖాద్రీ


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న డీసీ

యాకుత్‌పురా: రంజాన్ మాసంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ సూచించారు. ఈనెల 23 నుంచి ప్రారంభం కానున్న రంజాన్ మాసం నేపథ్యంలో సోమవారం ఆయన కార్పొరేటర్లు, వివిధ విభాగాలకు చెందిన అధికారులతో రెయిన్‌బజార్ సయ్యద్ విల్లా ఫంక్షన్ హాల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు, పలు బస్తీవాసులు స్థానికంగా ఎదురైన సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు సమావేశాం నిర్వహించామన్నారు. రంజాన్ అభివృద్ధి నిర్మాణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్ శాఖల అధికారులు స్థానిక ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడలన్నారు. పరిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు. తాగునీటి సరఫరా, విద్యుత్ అంతరాయం కలగకుండా అదనపు మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు రోడ్లపై చిరు వ్యాపారులను చలాన్లు వేసి ఇబ్బంది పెట్టొదన్నారు. సాయంత్ర వేళ నిర్వహించే ఇఫ్తార్ విందుల సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా శాంతిభద్రలు, ట్రాఫిక్ పోలీసులు పర్యవేక్షించాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో రెయిన్ బజార్, తలాబ్‌చంచలం, డబీర్‌పురా, సంతోష్‌నగర్, పత్తర్‌గట్టి, మొఘల్‌పురా డివిజన్ల కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, డాక్టర్ సమీనాబేగం, అలాందార్ వాలాజాహి, ముజఫర్ హుస్సెన్, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, నస్రీన్ సుల్తానా జీహెచ్ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నరసింహ, సౌత్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, జలమండలి జనరల్ మేనేజర్ వినోద్ భార్గవ్, ఈఈ బస్వరాజు, రెయిన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్‌గౌడ్, డీజీఎం, డీఈ, ఏడీఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం..

జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ సంతోష్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నరసింహ సోమవారం యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై చర్చించారు. ఆయనతో పాటు ఏఎంసీలు మోహన్‌రెడ్డి, సాయి శ్రీనివాస్, సానిటరి సూపర్‌వైజర్ ఫక్రుద్దీన్, మజ్లిస్ పార్టీ అమాన్‌నగర్-బీ ఏరియా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మొహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ పనులు వేగవంతం చేస్తాం


మంత్రి తలసానికి వివరాలు వెల్లడించిన బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: చుడిబజార్ ప్రాంతంలోని రామ్‌మనోహర్ లోహియా కమ్యూనిటీ నిర్మాణం పనులు వేగవంతం చేస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. కొన్ని నెలలుగా నిర్మాణం పనులు ఆగిపోవడంతో స్థానికుల వినతి మేరకు బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్ మంత్రి తలసాని దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. నిలిచిపోయిన పనులను అధికారులు వేగంగా చేపడుతారన్నారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్, ఇతర అధికారులు పర్యటించి పనులు వేగంగా చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. మంత్రి తలసాని సహకారంతో గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే మంత్రి సహకారంతో పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

యాదయ్యకు సన్మానం


డిప్యూటీ డైరెక్టర్ యాదయ్యను సన్మానిస్తున్న తెలంగాణ మాలల ప్రజా వేదిక ప్రతినిధులు

గౌలిపురా: తెలంగాణ మాలల ప్రజా వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ ఎస్సీ అభివృద్ధి శాఖ నాంపల్లి హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ యాదయ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ మాలల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం సత్యనారాయణ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చంద్రశేఖర్, మంత్రి కొప్పుల ఈశ్వర్, కేటీఆర్ దళితుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన మహానుభావులన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సమాజం నాయకుడు నరేశ్‌కుమార్ వాల్మీకి, కార్యదర్శి రాజేందర్, మురళీ, జి.వి.ఎస్.రామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి


అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రోహిత్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగాల జీవితాలతో చెలగాటం ఆడుతుందని యువజన కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మోత రోహిత ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షా పత్రం లీకేజీ ఘటన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ.. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను సస్పెండ్ చేయడంతో పాటు బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట భద్రతను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నగర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది'

గోల్కొండ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని కార్వాన్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కురకుల కృష్ణ ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు లీకేజీల ప్రభుత్వంగా పేరుపెట్టారన్నారు. ఎన్నో కష్టనష్టాలు భరిస్తూ నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతుంటారని టీఎస్‌పీఎస్సీ మాత్రం వారి జీవితాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆయన అన్నారు. స్వయంగా రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డిపై చీటికిమాటికి పోలీసులు కేసులు పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమీర్ ఖాన్, రవీందర్ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బహదూర్‌పురా: తాడ్‌బన్‌లోని ప్రభుత్వ ఓల్డ్‌సిటీ ఐటీఐలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన స్వల్పకాలిక సాంకేతిక నైపుణ్యత శిక్షణకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ రేణుక తెలిపారు. టూవీల్లర్ సర్వీసు టెక్నీషియన్, అసిస్టెంట్ డిజైన్ మేకర్ టెక్స్‌టైల్స్‌లో 45 రోజుల స్వల్పకాలిక శిక్షణను ఇస్తున్నామన్నారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ పాస్, ఫెయిలైన అభ్యర్థులు ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ మెమో, ఐటీఐ సర్టిఫికెట్‌తో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఓల్డ్‌సిటీ ఐటీఐలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఆసక్తి గల అభ్యర్థులు ఓల్డ్‌సిటీ ఐటీఐ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

తాత్కాలిక అతిథి అధ్యాపకుల కోసం..

దూద్‌బౌలి: ప్రభుత్వ సిటీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ఆర్థికశాస్త్ర విభాగంలో తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియమకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాల భాస్కర్ తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో 55శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోడానికి అర్హులన్నారు. పీహెచ్‌డీ, ఎంఫిల్, నెట్, స్లెట్ వంటి అదనపు అర్హతలతో పాటు బోధనానుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను మార్చి 27వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కళాశాల కార్యాలయంలో సమర్పించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

నాగేశ్వర్‌రావుకు సంపూర్ణ మద్దతు


మాట్లాడుతున్న రాజారావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది పల్లె నాగేశ్వర్‌రావుకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ట్రస్టెడ్ అడ్వకేట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రాజారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్‌లోని అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ న్యాయవాదుల సమస్యలు పరిష్కారం కావాలంటూ ఈ నెల 31న జరిగే అధ్యక్ష ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది అయిన నాగేశ్వర్‌రావుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యక్రమంలో బి.సురేందర్ కుమార్, ఉపాధ్యక్షులు శివకుమార్, కోశాధికారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న శ్రీనివాస్ తదితరులు

సుల్తాన్‌బజార్: వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో పనిచేస్తున్నే రెగ్యులర్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలిన తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ వైద్య విధాన పరిషత్ విభాగం కార్యదర్శి బైరపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదనాయక్ ఆధ్వర్యంలో వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్‌కు సమస్యలపై సోమవారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్య విధాన పరిషత్ పరిధిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని 317 జీఓ ప్రకారం.. స్టాఫ్ నర్సులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ విషయాలపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిషన్ నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా నటరాజ రామకృష్ణ శతజయంతి వేడుకలు


అనసూయమ్మను సన్మానిస్తున్న జస్టిస్ లక్ష్మణ్

గన్‌ఫౌండ్రీ: కిన్నెర ఆర్ట్ థియేటర్స్, నృత్య కిన్నెరల సంయుక్త ఆధ్వర్యంలో పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణ శతజయంతి సమాపనోత్సవం వేడుకలను సోమవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళాకృష్ణ నృత్య ప్రదర్శన ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం ప్రముఖ నృత్య సంగీత గాయని అనసూయమ్మ, సూర్యనారాయణ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు.. పరుగు



గోల్కొండ: దర్బార్ మైసమ్మ ఆలయం పక్కన ఉన్న రోడ్డుపై డ్రైనేజీ పొంగిపొర్లుతుంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొంగుతున్న మురుగునీటిని అరికట్టి రోడ్డుకు ప్యాచ్ వర్కులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా యూ టర్న్

గోల్కొండ: నానల్‌నగర్ చౌరస్తా నుంచి షాగౌజ్ హోటల్‌కు వెళ్లే రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన యూ టర్న్ ప్రమాదకరంగా మారింది. కొన్ని నెలల క్రితం నానల్‌నగర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి ప్రయోగాత్మకంగా ఈ యూ టర్న్‌ను ఏర్పాటు చేశారు. దీనివల్ల ఈ యూ టర్న్ వద్ద ప్రమాదాలు పెరిగిపోయాయి. తమ ప్రయోగం విఫలం కావడంతో వెంటనే ట్రాఫిక్ అధికారులు యూ టర్న్‌ను మూసివేశారు. అయితే గుర్తు తెలియని వాహనదారులు తమ సౌలభ్యం కోసం యూ టర్న్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించారు. దీంతో ఆ యూ టర్న్ వద్ద మళ్లీ ట్రాఫిక్ జామ్ కావడం, ప్రమాదాలు జరగడం సర్వసాధారణమైపోయింది. టోలిచౌకి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు అత్యంత సమీపంలో ఉన్న ఈ యూ టర్న్‌ను వెంటనే మూసివేయాలని, బారికేడ్లను తొలగించి రోడ్డు డివైడర్లను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే కౌసర్


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న షబ్బీర్ ఖాన్ తదితరులు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయనను నానల్‌నగర్ డివిజన్ ఖాదర్‌బాగ్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. ఖాదర్‌బాగ్, ఇందిరానగర్ ప్రాంతాల్లో నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేయించినందుకు ఆయనకు స్థానికులు మెమొంటో ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఖాదర్‌బాగ్‌కు చెందిన సీనియర్ మజ్లిస్ నాయకుడు షబ్బీర్‌ఖాన్ స్థానికంగా ఏ చిన్న సమస్యలు వచ్చినాతన దృష్టికి తెస్తారని, ఆయన చొరవ వల్లే ఖాదర్‌బాగ్, ఇందిరానగర్‌లకు తాను నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు సయ్యద్ జబ్బార్, మజీద్, కత్తాల్, మహ్మద్ యూసుఫ్ తదితరులున్నారు.

'రాష్ట్రంలో అవినీతి పాలన'


ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌తో దేవర శ్రీనివాస్, వంశీ తదితరులు

గోల్కొండ: సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణలో అవినీతి రాజ్యమేలుతుందని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం గుడిమల్కాపూర్‌కు చెందిన బీజేపీ నాయులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ తదితరులు ఆయనను కలిశారు. ఆయన మాట్లాడుతూ.. స్వయంగా సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత భారీ అవినీతికి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. పేపర్ లీకేజీలు కూడా మంత్రి కేటీఆర్ కనుసన్నలలో జరిగిందని ఆయన వివరించారు.

సందడిగా స్నాతకోత్సవం

గోల్కొండ: గోల్కొండ మోతీ దర్వాజ వద్ద ద రైజింగ్ స్టార్ నేషనల్ స్కూల్ కిండర్ గార్డెన్ స్కూల్ గ్రాడ్యుయేషన్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. గౌన్లు ధరించి చిన్నారులు ఎంతో ఉత్సాహంగా తమ పట్టాలను అందుకున్నారు. కిండర్ గార్డెన్ పూర్తి చేసుకున్న సందర్భంగా వారి ముఖాల్లో ఆనందం స్పష్టంగా కానవచ్చింది. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ సయ్యద్ షెహబాద్ ఖాద్రి మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా తాను ఎందరో ప్రతిభావంతులను తీర్చిదిద్దానన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ హిదాయత్ అలీఖాన్, సమీవుల్లా హుస్సేని తదితరులున్నారు.


గ్రాడ్యుయేషన్ సంబరాల్లో చిన్నారులు

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

జియాగూడ: జియాగూడలోని పలు ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు వెంటనే నిధులు మంజూరు చేయాలని జియాగూడ మాజీ కార్పొరేటర్ మునేందర్ కోరారు. ఈ మేరకు సోమవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జియాగూడలోని కేశవస్వామినగర్ ఎస్సీ గ్రేవియార్డు చుట్టూరా ఇనుప జాలి ఏర్పాటు కోసం కొలతలు, అంచనాలు వేయించగా రూ.5 లక్షల నిధులు అవసరం ఉన్నట్లు అధికారులు తెలిపారన్నారు. అలాగే శ్రీసాయినగర్‌లోని కమ్యూనిటీహాల్‌లో తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్, బోర్‌వెల్, షాబాద్ ఫ్లోరింగ్ నిర్మాణం కోసం రూ.5.5 లక్షల నిధులు అవసరమున్నాయన్నారు. శివ్‌బాగ్‌లోని రజక శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు అవసరం ఉన్నట్లు అధికారులు కొలతలు అంచనాలు వేసి చెప్పారన్నారు. రెండేళ్ల నుంచి ఈ పనులు జరగడం లేదన్నారు. వెంటనే అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేసి పనులు చేపట్టి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

'ఉస్మానియా' ఆధ్వర్యంలో మధుమేహ క్యాంప్



సుల్తాన్‌బజార్: మధుమేహ వ్యాధిని తొలిదశలో గుర్తించి చికిత్స అదించడంతో మరణాలు తగ్గనున్నాయని ఉస్మానియా వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ ప్రధానాచార్యులు డాక్టర్ కంచ భవాని అన్నారు. ఆమె సోమవారం ఉస్మానియా వైద్య కళాశాల కమ్యూనిటీ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మధుమేహం నిర్ధారణకు చికిత్స కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. అసంక్రమణ వ్యాధుల వల్ల జరిగే నష్టాలు, మరణాలను తగ్గించడంలో భాగంగా ఈ మధుమేహం వ్యాధి నిర్ధారణ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మధుమేహం రాకుండా, వచ్చిన వారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆహార విషయంలో డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ అనుపమ, డాక్టర్ అహ్మద్, డాక్టర్ శ్రీలత, డాక్టర్ నరేందర్‌రెడ్డి, పీజీ విద్య విద్యార్థులు, పారామెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'గురు రవిదాస్ సమాజ్ కమ్యూనిటీ హాల్‌ను పరిరక్షించండి'

నాంపల్లి: చుడీబజార్‌లోని రవిదాస్ సమాజ్ (మోచీ) కమ్యూనిటీ హాల్‌ను పరిరక్షించాలని స్థానిక బస్తీ నివాసి పి.ఎల్.రవికాంత్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం నాంపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. బస్తీ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే రామస్వామి చొరవతో రెండంతస్తుల భవనాన్ని నిర్మించారని గుర్తుచేశారు. కోట్లాది రూపాయలు నిధులు వెచ్చి అభివృద్ధి చేసిన కమ్యూనిటీహాల్‌లో అందరూ కలిసి ఫంక్షన్లు జరుపుకునేవారని, ప్రస్తుతం అక్కడ ఎలాంటి సభలు, సమావేశాలు, ఫంక్షన్లు జరుపుకునే పరిస్థితి లేకుండా పోయిందని వాపోయారు. జియాగూడకు చెందిన కొందరూ రౌడీషీటర్లు చుడీబజార్‌కు వచ్చి పేకాట ఆడుతూ రాత్రింబవళ్లూ తచ్చాడుతూ కనిపిస్తున్నారని మండిపడ్డారు. చుడీ బజార్ ప్రజలందరికీ ఉపయోగపడేలా గురు రవిదాస్ సమాజ్ కమ్యూనిటీ హాల్‌ను అందుబాటులో ఉంచేలా చూడాలని కోరారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి గురు రవిదాస్ సమాజ్ పేరిట నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను కాపాడాలని కోరారు.

'కేంద్రం వేధింపులకు బీఆర్‌ఎస్ భయపడదు'


ఎమ్మెల్సీ కవితకు సంఘీభావం ప్రకటించిన మమతా గుప్తా

అబిడ్స్: కేంద్రప్రభుత్వం వేధింపులకు బీఆర్‌ఎస్ భయపడదని నగర గ్రంథాలయ శాఖ డైరెక్టర్, గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకురాలు మమతాగుప్తా పేర్కొన్నారు. ఈడీలు, సీబీఐలు బీఆర్‌ఎస్ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాయన్నారు. న్యూ ఢిల్లీకి మమతా గుప్తా వెళ్లి ఎమ్మెల్సీ కవితకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ తరహాలోనే దేశ నలుమూలలా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆదరణ లభిస్తుండడంతో తట్టుకోలేని బీజేపీ కవితను వేధిస్తుందన్నారు. బీజేపీ వేధింపులకు తాము తలొగ్గేది లేదన్నారు.

యోగాతోనే మానసిక ప్రశాంతత: సుధీర్ కులకర్ణి


వేడుకలో సుధీర్ కులకర్ణి, మెట్టు వెంకటేష్, మహేష్ తివారి

అబిడ్స్: యోగాతోనే మానవాళికి మానసిక ప్రశాంతత ఉంటుదని భారతీయ యోగ్ సంస్థాన్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్ కులకర్ణిఅన్నారు. భారతీయ యోగ్ సంస్థాన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక శిక్షణ శిబిరాల ముగింపులో ఆయన పాల్గొని అవగాహన కల్పించారు. వాతము, పిత్తము, కఫంతో మనిషి అనారోగ్యాలపాలవుతున్నారన్నారు. వాత పిత కఫంలు మనిషి శరీరంలో సమతూల్యత ఉండేందుకు యోగాసనాలు దోహదపడుతాయన్నారు. ఏ అనారోగ్యమైన మనిషి దానికి సరిపడే యోగాసనాలు చేస్తే ఆరోగ్యకరంగా జీవిస్తారన్నారు. మానవుడిలోని ప్రతి విభాగానికి కొన్ని యోగాసనాలు ఉన్నాయన్నారు. ప్రతి మనిషి జీవితంలో ప్రతిరోజూ కొంతసేపు అయినా యోగాసనాలు చేస్తే సుఖః సంతోషంగా, ఆరోగ్యకరంగా జీవిస్తారని కులకర్ణి పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు మెట్టు వెంకటేష్, భారతీయ యోగ్ సంస్థాన్ సభ్యులు లత, మహేష్ తివారి, దేవేందర్ సింగ్, ఝాన్సీ, సత్యనారాయణ, సరోజ, ఇంద్రజీత్ సింగ్, జయశ్రీ, శోభా, కేతన్ పాల్గొన్నారు.